మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పూజలు

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

హాజీపూర్, ఆగస్టు 28 : మండలంలోని రాపల్లి ఆర్ అండ్‌ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శివ పంచాయత శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం హన్మాన్, నవ గ్రహాల విగ్రహాల ప్రతిస్థాపన నిర్వహించారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావ్ పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మందపెల్లి స్వర్ణలత-శ్రీనివాస్, నాయకులు విజిత్‌రావ్, రాపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

తాండూర్‌లో డీపీవో ఆకస్మిక పర్యటన

నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

తాండూర్, ఆగస్టు 28 : తాండూర్ మండల కేంద్రంతో పాటు, అచ్చలాపూర్‌లో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల పనుల(మెర్జింగ్ స్టేట్‌మెంట్) వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తిచేసి ఆన్‌లైన్‌లో రెండురోజుల్లోగా నమోదు చేయాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం గ్రామాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు. తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో నర్సరీని తనిఖీ చేశారు. మొక్కలు పిష్టింగ్, గ్రేడింగ్ నిర్వహించాలని, జర్మనేషన్ రాని సంచుల్లో వేరే మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అనిల్‌కుమార్, కార్యదర్శులు దివాకర్, కల్పన పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తాండూర్, ఆగస్టు 28 : విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సూచించారు. స్థానిక విద్యా భారతి హైస్కూల్‌లో బుధవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు గంజాయి, మాదక ద్రవ్యాల వాడకం, వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఏసీపీ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సీఐ కుమారస్వామి, మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, తాండూర్ ఎస్ఐ డీ కిరణ్ కుమార్, విద్యా భారతి హైస్కూల్ కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఈజీఎస్ ఏపీవో తొలగింపు

చింతలమానేపల్లి, ఆగస్టు 28 : మండలంలోని ఉపాధి హామీ ఏపీవో గోవర్దన్ సింగ్‌ను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగించారు. ఈ మేరకు డీఆర్డీవో నుంచి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది. టెక్నికల్ అసిస్టెంట్ అయిన గోవర్దన్ సింగ్‌కు గతంలో ఏపీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సస్పెన్షన్ పీరియడ్‌లో ఉండగా, లిఖిత పూర్వక ఆదేశాలు లేకుండా విధుల్లో పెట్టుకోవడంతో బాధ్యతా రాహిత్యంపై ఆగ్రహించి తప్పించినట్లు సమాచారం. కౌటాల ఏపీవో పూర్ణిమను చింతలమానేపల్లి మండల ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిసింది. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్‌ను వివరణ కోరగా, డీఆర్డీవో నుంచి ఆదేశాలు వచ్చింది వాస్తవమేనని తెలిపారు.

కొట్నాక భీమ్‌రావ్ జీవితం ఆదర్శం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 28 : ఉమ్మడి రాష్ట్ర మొట్టమొదటి గిరిజనశాఖ మంత్రి కొట్నాక భీమ్‌రావ్ రాజకీయ జీవితం అందరికీ ఆదర్శమని రాజ్ గోండ్ సేవా సమితి జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం సూరు మాస్టర్ పేర్కొన్నారు. 29న భీమ్‌రావ్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని రాయి సెంటర్ వద్ద మాట్లాడారు. జిల్లా రాయి సెంటర్ అడ్వైజర్ కొట్నాక కిషన్‌రావు, రాజ్ గోండ్ సేవాసమితి కోశాధికారి కుర్మత మారుతి, ఐటీడీఏ మాజీ చైర్మన్, గిరిజన నాయకుడు సిడం అర్జున్ మాస్టర్, మండల రాయి సెంటర్ సర్మేడి జ్ఞానేశ్వర్, గొండ్వానా యువజన నాయకుడు ఆత్రం చందన్ షా పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

బెల్లంపల్లి, ఆగస్టు 28 : వంద పడకల దవాఖానలో విధులు నిర్వర్తిస్తున్న వివిధ విభాగాలకు చెందిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మాజీ జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. 100 పడకల దవాఖానలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాలు రాకపోవడంతో కార్మికులు, వారి కుటుంబసభ్యులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పీ పార్వతి, కార్యదర్శి దాసరి రమేశ్, ఉపాధ్యక్షురాలు ఎల్ కనక లక్ష్మి, సహాయ కార్యదర్శి ఏ జానకి, కోశాధికారి ఎం శేఖర్, కమిటీ సభ్యులు కే సాయికుమార్, ఎండీ అన్వర్, డీ శ్రీకాంత్, ఏ నాగమణి, బీ విజయ, తిరుమల, యూ సరిత ఎన్నికయ్యారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి

వాంకిడి, ఆగస్టు 28 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా కృషి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఐఈవో కల్యాణి పేర్కొన్నారు. బుధవారం వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాందాస్, సిబ్బంది చంద్రయ్య, సురేందర్ కుమార్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్‌కుమార్, తిరుపతి తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహిళా సంఘాలకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న డీఆర్డీవో దత్తారాం

జైనూర్, ఆగస్ట్ 28 : మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్డీవో దత్తారాం అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం మహిళా సంఘాలకు పెరటి కోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు మహిళా సంఘాల ద్వారా రుణాలు పొంది పురుషులతో సమానంగా ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో రామకృష్ణ, డీపీఎం అన్నాజి, ఏపీఎం సుజాత, మండల సమాఖ్య అధ్యక్షురాలు కొడప మోతుబాయి, ఉపాధ్యక్షురాలు గాయకవాడ్ సుశీల ఐకేపీ సీసీలు మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

వెటర్నిటీ అసిస్టెంట్ పోస్టుకు ఎంపిక

చెన్నూర్ రూరల్, ఆగస్టు 28 : మండలంలోని ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి సందీప్‌రెడ్డి వెటర్నిటీ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాడు. సమ్మక్క-రాజిరెడ్డి కొడుకు సందీప్ రెడ్డి 5వ తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. 10వ తరగతి వరకు బెల్లంపల్లి గురుకులంలో, నల్గొండలోని సర్వేల్‌లో ఇంటర్ పూర్తిచేశాడు. అనంతరం ఎంసెట్ ఎంట్రెన్స్ రాసి వెటర్నిటీ సైన్స్‌ను ఎంచుకున్నాడు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు కళాశాలలో ఐదేళ్లు వెటర్నిటీ సైన్స్ కోర్సు పూర్తి చేశాడు. 2023లో పరీక్ష రాసి, జాబ్‌కు సెలక్ట్ అయ్యాడు. త్వరలో పోస్టింగ్ ఇస్తారని సందీప్ రెడ్డి తెలిపాడు.

ఆర్బీఐ-90 క్విజ్ పోటీలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- సంబంధిత పోస్టర్ విడుదల

పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, ఆర్బీఐ ఏజీఎం మహ్మద్ జయూర్ రహమాన్

నస్పూర్, ఆగస్టు 28 : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆర్బీఐ-90 క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆర్బీఐ ఏజీఎం మహ్మద్ జయూర్ రహమాన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, బ్యాంక్ అధికారులతో కలిసి కలెక్టర్ క్విజ్ పోటీల పోస్టర్‌ను విడుదల చేశారు. 25 ఏళ్ల లోపు యువతీయువకులకు జనరల్ నాలెడ్జ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫస్ట్ స్టేజ్‌లో స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్ నుంచి ఆన్‌లైన్ క్విజ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ చూపి వారికి సెకండ్ స్టేజ్‌లో రాష్ట్ర స్థాయి పర్సనల్ క్విజ్ నిర్వహించి.., విజేతలకు 3వ స్టేజ్‌లో జోనల్ గ్రూపుల వారీగా ఇతర రాష్ట్రాల బృందాలతో పోటీలు ఉంటాయని చెప్పారు. ఫైనల్ రౌండ్ జాతీయస్థాయిలో ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఇద్దరు ఒక బృందంగా రిజిస్టర్ చేసుకోవచ్చని చెప్పారు. రాష్ట్రస్థాయి విజేత బృందానికి రూ.2 లక్షలు, జోనల్ విజేత బృందానికి రూ.5 లక్షలు, జాతీయస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన వారికి రూ.10 లక్షలు, ద్వితీయ స్థానం విజేత బృందానికి రూ.8 లక్షలు, తృతీయ స్థానం విజేత బృందానికి రూ. 6 లక్షలు బహుమతిగా అందించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

చింతలమానేపల్లి, ఆగస్టు 28 : పీహెచ్‌సీల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సిబ్బందికి సూచించారు. చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం నాయక్, డాక్టర్ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వైరల్ జ్వరాలు, డెంగ్యూ, ఇతర జబ్బులపై ఆరా తీశారు. రెగ్యులర్ స్టాఫ్ లేక ఇబ్బందిగా ఉందని వారు చెప్పడంతో వెంటనే సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాల భవనాల నిర్మాణానికి చొరవ తీసుకుంటామన్నారు. బాబాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పనులను పరిశీలించారు. అసంపూర్తి పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

కౌటాల పీహెచ్‌సీలో..

కౌటాల, ఆగస్టు 28 : కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది సరిగా లేకపోవడంతో రోగులకు మెరుగైన వైద్యం అందడంలేదని, ప్రసవాలు కూడా జరగడం లేదన్నారు. దీనిపై వెంటనే మాట్లాడి సమస్య పరిష్కరించేలా చూస్తానని తెలిపారు. ప్రసవాల గది, ఫార్మసీ, ల్యాబ్ ఇతర గదులను పరిశీలించారు. మందుల వివరాలు తెలుసుకొని అవసరమైన మందులను తప్పకుండా అందుబాటులో ఉంచాలని, అవసరమున్న మందుల ఇండెంట్ పెట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాత ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని పరిశీలించి, ఆక్రమణలపై తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రసాద్‌కు సూచించారు.

చింతలమానేపల్లి : పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఎస్పీని కలిసిన ఎస్ఐ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 28 : కాగజ్‌నగర్‌టౌన్ ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గట్ల సుధాకర్.. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎస్ఐకి ఎస్పీ సూచించారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

తాండూర్ పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరిశ్‌రాజు

తాండూర్, ఆగస్టు 28 : మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలకుండా ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని మంచిర్యాల డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజు వైద్య సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో, బెల్లంపల్లి వైద్యాధికారి సుధాకర్ నాయక్‌తో కలిసి బుధవారం తాండూర్ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వందశాతం గర్భిణులను నమోదు చేయాలని, వంద శాతం పిల్లలకు టీకాలు ఇప్పించాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలు చేయించాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ వైద్యాధికారి ఝాన్సీ, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, సూపర్‌వైజర్ రమాదేవి, సాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో ఆదాయం

మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ హరికృష్ణ

బెల్లంపల్లి, ఆగస్టు 28 : తేనెటీగల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా మార్చుకొని ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోట హరికృష్ణ తెలిపారు. 100 రోజుల వీక్షిత్ భారత్ ప్రణాళికలో భాగంగా మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల రైతులకు వ్యర్థాల నుంచి వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, తేనె టీగల పెంపకంలో పాటించవలసిన మెలకువలపై నైపుణ్య శిక్షణను బుధవారం ప్రారంభించారు. రసాయన ఎరువుల వాడకంతో భూసారంతోపాటు, దిగుబడులు తగ్గుతాయని ఆవేదనన వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపతి, డాక్టర్ ప్రవంతి, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

బాలికపై బాలుడి లైంగికదాడి

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 28 : 17 ఏళ్ల బాలుడు 17 ఏళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన సంఘటన మంచిర్యాల జిల్లాలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన ఓ బాలుడు ఓ బాలికను ప్రేమిస్తున్నానని కొంత కాలంగా వెంటపడ్డాడు. ఆమెను బెదిరించి, మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫోక్సో కేసు నమోదు చేసి బుధవారం ఆ బాలుడిని అదుపులోకి తీసుకొని, కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

యువతి ఆత్మహత్య

శ్రీరాంపూర్, ఆగస్టు 28 : శ్రీరాంపూర్ ఏరియాలోని కృష్ణకాలనీకి చెందిన ఆకుల శిరీష(20) మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నదని ఎస్ఐ సంతోష్ తెలిపారు. 20 ఏళ్ల క్రితం తల్లిదండ్రులు విడిపోయారు. సోదరుడు, శిరీషను తల్లి పోషిస్తున్నది. శిరీష ఇంటర్ పూర్తిచేయగా, ఏడాది నుంచి హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తున్నది. రెండు రోజుల క్రితం శ్రీరాంపూర్‌లోని ఇంటికి వచ్చింది. ఇంటి పరిస్థితి చూసి మానసికంగా బాధపడి, ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నది. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకరికి జైలు శిక్ష

మందమర్రి రూరల్, ఆగస్టు 28 : రామకృష్ణాపూర్ పట్టణంలోని క్యాతనపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నదీమ్ అన్సారికి 9 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ మంచిర్యాల ప్రధాన ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సీహెచ్ సంపత్ బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన నదీమ్ అన్సారీ జల్సాలకు అలవాటు పడి గత మే నెలలో క్యాతనపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల సుర రాయలింగు ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. బీరువా నుంచి బంగారం, వెండి ఆభరణాలు అపహరించాడు. బాధితుడు ఫిర్యాదు చేయగా, ఆర్కేపీ ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. నదీమ్ అన్సారీని కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు కానిస్టేబుల్ డీ శ్రీనివాస్ సాక్షులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ షహీన్ సుల్తానా కేసును వాదించగా, నేరం రుజువైంది. ఈ మేరకు న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

పరిశుభ్రత పాటించాలి

సిర్పూర్(యు), ఆగస్టు 28 : మండలంలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో తప్పని సరిగా పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేకాధికారి భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని బుధవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకోవాలి

బెల్లంపల్లి, ఆగస్టు 28 : ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సీపీఐ శ్రేణులు ఇంటింటికీ వెళ్లాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. 23, 24, 25 తేదీల్లో హన్మకొండలో జరిగిన సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల్లో చేసిన తీర్మానాలను వెల్లడించారు. సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు నిర్దిష్టమైన ఉద్యమాలతో నాయకులు ప్రజల వద్దకు వెళ్లాలని సూచించారు. నాయకులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, మిట్టపల్లి శ్రీనివాస్, చిప్ప నర్సయ్య, ఆడెపు రాజమౌళి, కొండు బానేశ్, బొంతల లక్ష్మీనారాయణ, రత్నం రాజం, బొంకూరి రాంచందర్, పుట్ట శ్రీనివాస్, కుందేళ్ల వంకర్, మేకల రాజేశం పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 28 : మండలంలోని మోవాడ్, బలన్‌పూర్, చింతగూడా గిరి గ్రామాల్లో అడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ వినోద్ కుమార్ మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. విష జ్వరాలపై అవగాహన కల్పించారు. 15 మంది రక్త నమూనాలు సేకరించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, నాజమస్, సరిత, ఉత్తమ్, భీంరావ్, పరుశురాం, సుర్యకళ, వసంత, రాధ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, ఆగస్టు 28 : మండలంలోని కైరిట్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. 52 మందికి పరీక్షలు చేశారు. నలుగురి రక్త నమూనాలు సేకరించి, మందులను అందజేశారు. అనంతరం పంచాయతీ సిబ్బంది సహకారంతో డ్రైడే నిర్వహించారు. వైద్య విస్తరణ అధికారి రవిదాస్, పీహెచ్ ఎన్ కృష్ణియాన, హెచ్ఎస్ అనుసాయ, ఏఎన్ఎం సునంద, ఆశ వర్కర్ భీమక్క, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎల్లంపల్లి'కి పెరుగుతున్న నీటి మట్టం

హాజీపూర్, ఆగస్టు 28 : శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా పెరుగుతున్నది. ప్రాజెక్టు 148 మీటర్లకు గాను 146.93గా ఉన్నది. 20.175 టీఎంసీలకు గాను 17.2202 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. 2,892 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల నిమిత్తం 331 క్యూ సెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, నంది పంపు హౌస్ ద్వారా 9,450 క్యూ సెక్కులు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హాజీపూర్, ఆగస్టు 28 : మండలంలోని దొనబండ శివారులో బుధశారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లంపల్లికి చెందిన పులి మూర్తి (38)మృతిచెందినట్లు ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. బెల్లంపల్లికి చెందిన పులి మూర్తి.. తన భార్య జ్యోత్స్న, తమ్ముడు సురేశ్, తమ్ముడి భార్య అశోకతో వేమేలవాడ నుంచి బెల్లంపల్లికి ఆటోలో వెళ్తున్నారు. తమ్ముడు సురేశ్ ఆటో నడుపుతుండగా, వారంతా లోపల కూర్చున్నారు. దొనబండ శివారులో ఒక్కసారిగా ఎడమ వైపు తిప్పగా పులి మూర్తి కిందపడ్డాడు. తీవ్రగాయాలవడంతో మంచిర్యాల దవాఖానకు తరలించారు. కాగా, పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. జ్యోత్స్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 28 : గౌతం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ సరిత బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వచ్చే నెల 5వ తేదీలోగా మంచిర్యాల పట్టణం చున్నంబట్టి బ్రిడ్జి పక్కన కైలసగిరి కాలనీలోని దీప్తి బోటిక్ సెంటర్‌లో గానీ, 99895 27152 నంబర్‌ను గానీ సంప్రదించాలని సూచించారు.

ఆవిర్భావ వేడుకలు

మందమర్రి రూరల్, ఆగస్టు 28 : పులిమడుగులో వికలాంగుల హక్కుల పోరాట సమితి 18వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఆ సమితి జాతీయ నాయకుడు పెద్దపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. 2007, ఆగస్టు 28న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో వికలాంగుల హక్కుల సాధన కోసం వీఎచ్‌పీఎస్ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఇందూరి రమేశ్, బండోజు నరేశ్, బానోతు రాజు, అజ్మీరా రవి, ధరావత్ రాందాస్ దాసు, మల్లేశ్, నరేశ్, సురేశ్, ధరావత్ సుశీల, బానోతు అఖిల పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

తిరుపతిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్ రూరల్, ఆగస్టు 28 : చెన్నూర్ మండలంలోని దుగ్నెపల్లిలో తాజా మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతిని బుధవారం బీఆర్ఎస్ మండల నాయకులు పరామర్శించారు. కొద్ది రోజులుగా తిరుపతి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ కౌన్సిలర్ రేవల్లి మహేశ్, మాజీ ఎంపీటీసీ నగవత్ శ్రీనివాస్, కోటపల్లి బీఆర్ఎస్ నాయకులు పెద్దపోలు సాంబగౌడ్, మారిశెట్టి సాగర్ తదితరులు ఉన్నారు.

నీటికుంటలో పడి మహిళ మృతి

చింతలమానేపల్లి, ఆగస్టు 28 : చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన బంటు రుకుంబాయి (50) ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతిచెందినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. కూలీ పని కోసం వెళ్లే క్రమంలో స్థానిక కేజీబీవీ వెనుకాల కుంటలో పడిపోయింది. భర్త బంటు చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పకడ్బందీగా చేపట్టాలి

వాంకిడి, ఆగస్టు 28 : ప్రత్యేక ఓటరు జాబితా సవరణను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీవో ఖాజా అజీజొద్దిన్ అన్నారు. బుధవారం మండలంలోని ఇంధాని రైతూ వేదికలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పరిశీలించి కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. వార్డుల వారిగా జాబితాను సవరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇందానీ కార్యదర్శి దినేష్, నవేగూడ కార్యదర్శి నానాజీ, బాలాజీ ఉన్నారు.

బాలుడి మృతదేహం లభ్యం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 28 : మండలంలోని రౌట సంకేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బొండగూడ గ్రామానికి చెందిన సాగ్రి బాయి, ఆమె కొడుకు అశ్విన్ (3) ప్రమాదవశాత్తు వట్టివాగు కాలువలో పడి, మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, మంగళవారం సాగ్రి బాయి మృతదేహం లభించగా, కొడుకు అశ్విన్ మృతదేహం బుధశారం వట్టివాగు కాలువ ఆర్ఆర్‌కాలనీ సమీపంలో దొరికినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జైనూర్, ఆగస్టు 28 : సద్గురు పూలాజీ బాబా జయంతి వేడుకలను ఈ నెల 30న ఘనంగా నిర్వహించాలని సంస్థాన్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్ పేర్కొన్నారు. జైనూర్ మండలంలో బుధవారం సద్గురు పూలాజీ బాబా జయంతి వేడుకల పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డుక్రె సుభ